ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 22.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 15 మార్చి 2025





నిర్మానుష్యంగా కనిపిస్తున్న జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్

జిల్లాలో మాడుపగిలే ఎండలు

- జిల్లాలోని బోథ్‌లో గరిష్ఠంగా 40.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు
- అడుగంటిపోతున్న నీటి జాడలు
- ఎండుముఖం పడుతున్న పంటలు
- తాగునీటితో పాటు సాగునీటికీ తప్పని తిప్పలు

7లో



ఎమ్మెల్యే పాయలకు రంగులు పూస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్

హోలీ.. రంగోళి!

- వేడుకల్లో పాల్గొని స్టెప్పులేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ
- చిన్నారుల కోలాహలం.. యువతీ, యువకుల కేరింతలు
- ఊరువాడలా డీజే, డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు
- జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు

వివరాలు లోపలి పేజీల్లో...



రంగులు పూసుకుని కేరింతలు కొడుతున్న యువతులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రాం

ఆదిలాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రాంను ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం తెలిపారు. తలమడుగు మండలం దేవాపూర్ ప్రైమరీ స్కూల్, ఖోడద్ ప్రైమరీ స్కూల్, ఆదిలాబాద్ అర్బన్‌లోని తాటిగూడ ప్రైమరీ స్కూల్‌లో శనివారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించం జరుగుతుందని తెలిపారు. ఎస్‌సీఈఆర్టీ తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షణ విద్యా శాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో కృత్రిమ మేధాను ఉపయోగించి బోధనలను మెరుగు పర్చడానికి ఏఎక్స్ ఎల్ఎక్స్‌టెం ఫౌండేషన్ సహకారంతో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారని తెలిపారు. మొదట ఈనెల 15 నుంచి 4 ప్రైమరీ పాఠశాలల్లో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. ప్రధానంగా 3, 4, 5వ తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసన సామర్థ్యాలను సాధించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాలల్లో ఐదు కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని, విండోస్ 10 తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు.

సత్ఫలితాలను ఇస్తున్న గిరిజన క్యాంటీన్ సేవలు : పీవో

ఉట్నూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్ ప్రారంభించి ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్‌ను గతేడాది మార్చి 15న రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లతో కలిసి ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నేటితో యేడాది పూర్తయ్యిందన్నారు. గిరిజన భవన్‌లో గిరిజన క్యాంటీన్‌లో ప్లేట్ మిల్స్ కేవలం రూ.5లకే మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ క్యాంటీన్‌తో కొలాం గిరిజనులకు ఉపాధి లభించిందన్నారు. అలాగే చుట్టు పక్కల గ్రామాల నుంచి వివిధ రకాల పనుల కోసం ఉట్నూర్ వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని రూ.5లకే భోజనం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గిరిజన క్యాంటీన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 77,690 మంది భోజనం చేయడం జరిగిందని, ఐదుగురు సభ్యులతో గ్రూపు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల భోజనం కోసం 160 క్వింటాళ్ల బియ్యాన్ని వినియోగం జరిగిందని, వెజిటేబుల్స్ 80 క్వింటాళ్లు, పప్పులు 60 క్వింటాళ్లు, సుగంధద్రవ్యాలు దాదాపు రూ.4 లక్షల వరకు వినియోగించడం జరిగిందన్నారు.

ఫారెస్టు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఎఫ్‌బీఓ బీడం సుభాష్

ఇచ్చోడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని ఫకీర్‌పేట్ బీట్ పరిధిలో కలప స్మంగర్లు పెద్దఎత్తున కలపను నరికి వేసిన కథనానికి అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. 'అడవి తల్లి అరణ్య రోదన' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఫకీర్‌పేట్ బీట్ పరిధికి చెందిన ఎఫ్‌బీవో బీడం సుభాష్‌ను సస్పెన్షన్ చేసినట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. అటవీ ప్రాంతలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వారిపై వేటు తప్పదన్నారు.

- తలమడుగు మండలంలో బొండలగడ్డలుగా మారిన అసైన్డ్ భూములు



రెచ్చిపోతున్న.. మైనింగ్ మాఫియా!

- జిల్లాలో ఆగని మొరం అక్రమ తవ్వకాలు
- మైనింగ్ మాఫియాకు అధికారుల అండదండలు
- నిత్యం రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- తేలికగానే తీసుకుంటున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

ఆదిలాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్ మాఫియా మరింత గా రెచ్చిపోతున్నారు. ల్యాండ్ లెవలింగ్, అభివృద్ధి పనుల పేరిట దర్జాగా అక్రమ దందా కొనసాగుతోంది. ముఖ్యంగా నేరడిగొండ, కుప్టి, తలమడుగు మండలం కజ్జర్ల, దేవాపూర్, తాంసి మండలం పొన్నారి, మావల మండలం బట్టిసావర్గాం గ్రామ శివారుల్లో మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రీపగలు అనే తేడా లేకుండా నిత్యం వందలాది వాహనాలు మొరం మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అక్రమార్కులు ఇదే దందాను ఉపాధిగా మల్చుకుంటున్నారు. నిత్యం పట్టపగలే మొరం అక్రమ తవ్వకాలు సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు చిక్కకుండా మైనింగ్ మాఫియా రాత్రి వేళల్లో మొరం తవ్వకాలను చేపడుతూ.. భారీగా తరలిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి భూములే కావడంతో ఎర్రమట్టి మొరానికి భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టలు, అసైన్డ్ భూములను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ప్రైవేట్ పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే అధిక ఖర్చు కావడంతో మైనింగ్ మాఫియా కన్ను నిరుపేదల అసైన్డ్ భూములపై పడుతోంది. ఎంతో కొంత ఇచ్చి అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా.. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడమే లేదని స్థానికులు చెబుతున్నారు.



- తలమడుగు మండలంలో బొండల గడ్డలుగా మారిన అసైన్డ్ భూములు

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో మొరం అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది. మైనింగ్ వ్యాపారులు రాయల్టీ పన్నును యథేచ్ఛగా ఎగవేస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం ఒక్కో క్యూబిక్ మీటర్‌కు కంకర తవ్వకాలపై రూ.75, మొరం తవ్వకాలపై రూ.35, ఇసుక తవ్వకాలపై రూ.45 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ పన్నును చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో రాయల్టీని చెల్లించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. 600 ఫీట్ల సామర్థ్యం ఉన్న టిప్పర్‌లో 6 క్యూబిక్ మీటర్ల మొరాన్ని తరలించవచ్చు. ఈ లెక్కన ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.35 చొప్పున 6 క్యూబిక్ మీటర్లకు రూ.210 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నిత్యం వందలాది సంఖ్యలో ట్రిప్పుల మొరంను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కానీ మైనింగ్ మాఫియా రాయల్టీ పన్నును ఎగవేస్తూ అందినకాడికి జేబులో వేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులకు రాజకీయ పార్టీ నేతల అండదండలు ఉండడంతో

(తరువాయి 6వ పేజీలో...)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- జిల్లాలో పలుచోట్ల బీఆర్ఎస్ నేతల నిరసనలు

ఆదిలాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుంచి అకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట పొలాలకు సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలన్నారు. జగదీశ్వర్‌రెడ్డిని ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇస్తుందని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వెంటనే సస్పెన్షన్ వేటును ఎత్తి వేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు.ఇందులో అలాల అజయ్, ఇజ్జగిరి నారాయణ, కొండగణేష్, దమ్మపాల్, మెట్టు ప్రహ్లాద్, గోవర్ధన్, తిరుపతి, మహేశ్, దేవిదాస్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: అసెంబ్లీ సమావేశాలలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ శుక్రవారం బోథ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం కావడం జరిగిందనితి, వారి పార్టీని ఎక్కడ నిలదీస్తారోనని భయపడ్డ ప్రభుత్వం ముందస్తుగా జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. వాస్తవాలను నిలదీస్తే జీర్ణించుకోలేని ప్రభుత్వం సస్పెండ్‌లకు గురి చేసిందని వారు విమర్శించారు. శాంతియుతంగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం సిగ్గుచేటని వారు విమర్శించారు. అరెస్టులతో ప్రజల గొంతుకలను ఆపలేరని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, డాక్టర్ స్వామి, కె. గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ బస్టాండ్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



నార్నూర్‌లో గాంధీచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

- 'ప్రశ్నిస్తే.. సస్పెండ్ చేస్తారా?'

నార్నూర్: అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై సభా ముఖంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా? అని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు సురేష్ ఆడె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతుంటే అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వక ఏకంగా సభకు రాకుండా ఎమ్మెల్యేలపై వెయిట్ వేయడం అనేది సిగ్గుచేటు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.02



ఒకరిని అతిగా అనుమానించటానికి దూరంగా ఉండండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి.

పూలాజీ బాబా చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

- అంద్ ఆదివాసీ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్

ఇంద్రవెల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పూలాజీ బాబా సూచించిన ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని అంద్ ఆదివాసీ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిరం 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూలాజీ బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి గ్రంథ పూజ చేసి ధ్యాన్ ధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు వ్యసనాలకు దూరంగా ఉండి పూలాజీ బాబా సూచించిన భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంద్ ఆదివాసీ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, బాబా భక్తులు పవన్, మాధవ్, గజానంద్, బాలరాజ్, బక్కన్న, తిరుపతి, వామన్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



పూలాజీ బాబా చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కేంద్ర మంత్రికి విన్నవిస్తున్న ఎంపీ గోడం నగేష్

జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి : ఎంపీ

బోథ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 44 నెంబర్ జాతీయ రహదారి కరంజి నుంచి గుబిడి రోడ్డును అంతరాష్ట్ర రహదారి కనెక్టివిటీ నిధులతో అభివృద్ధి చేయాలని ఎంపీ గోడం నగేష్ కేంద్ర జాతీయ రహదారులు మంత్రి నితిన్ గట్కారిని కలిసి విన్నవించారు. గురువారం రాత్రి డిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి జిల్లా రహదారుల సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. బోరజ నుంచి మాహూర్ వరకు జందాపూర్ బీంపూర్ అర్లీ కరంజి మాన్వి సార్ కానీ మీదుగా మాహూర్ వరకు రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. 44 జాతీయ రహదారిపైనున్న గుడిహత్నూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలని ఎంపీ కేంద్రమంత్రికి విన్నవించారు. పెన్గంగా నుండి గోదావరి నది వరకు రోడ్డుపైన సేఫ్టీ పనులను సత్వరమే పూర్తి చేయాలని విన్నవించగా త్వరలోనే ఈ విషయమై తగు నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇవ్వడం జరిగిందని ఎంపీ నగేష్ పేర్కొన్నారు.

గ్రూప్-2, 3 ఫలితాలలో ఉత్తమ ర్యాంకు

మావల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విడుదలైన గ్రూప్- 2, 3 ఫలితాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ తీసుకున్న అభ్యర్థి దుర్ల అవినాష్ ఉత్తమ ర్యాంకు సాధించారు. జైనథ్ మండలం ఆడ గ్రామానికి చెందిన దుర్ల అశోక్ కుమారుడు అవినాస్ గ్రూప్-2లో ఎస్సీ కేటాగిరిలో 78వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా శుక్రవారం విడుదలైన గ్రూప్-3 ఫలితాలలో సైతం స్టేట్ ర్యాంకు 760, జోనల్ ఎస్సీ విభాగంలో 6వ ర్యాంకు సాధించిన తన ప్రతిభ కనబరిచాడు. దీంతో గ్రామస్థులతో పాటు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, అధ్యాపక బృందం అవినాష్‌ను అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఇంద్రవెల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దుబ్బాక సునీల్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడుపుతున్న 10 మందికి జరిమానాలు విధించామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న సమయంలో రోడు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుండటంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు కె.రమేష్, రమ్య, పోలీస్ కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.


డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై దుబ్బాక సునీల్

ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు


హోలీ వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


హోలీ సంబరాల్లో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్


ముక్రా(కె)లో హోలీ ఆడుతున్న మహిళలు




ఈశ్వర్‌నగర్ గ్రామంలో హోలీ ఆడుతున్న స్థానికులు

ఉట్నూర్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల ప్రజలు శుక్రవారం హోలీ సంబరాలను గనంగా నిర్వహించుకున్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాలలో ఆదివాసీలు తమ ఆచార సంస్కృతీ, సంప్రదాయాలతో కామదహనం కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ఉట్నూర్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితితో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ తమ వీధుల్లో కామదహనం కార్యక్రమాలను గురువారం రాత్రి నిర్వహించి శుక్రవారం హోలీ పండుగను నిర్వహించుకున్నారు. ఉట్నూర్ సర్కిల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గండికోట మొగిలి శాంతిభద్రతల పరిస్థితులు చూసుకుంటేనే ప్రజలు, ఉద్యోగులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఇందులో మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, ఆదివాసీ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: హోలీ పండుగ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలోని తన నివాసంలో హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళలు, నాయకులు, యువకులు పెద్దఎత్తున ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఎమ్మెల్యేతో హోలీ పండుగను రంగులు పూస్తూ ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సైతం రంగులు పూస్తూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆదివాసీ గిరిజన గూడేల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వయస్సు సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్దలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నపిల్లలు బాటిళ్లలో రంగులు కలిపి ఒకరికొకరు చల్లుకున్నారు. మరి కొందరు సహజ సిద్ధమైన ప్రకృతి రంగు అయినా గోగు పూలతో తయారు చేసిన రంగులను చల్లుకున్నారు. పలు గ్రామాల్లో కొందరు యువకులు కోడి గుడ్లు, టమాటాలు కొట్టుకొని హోలీ వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున హోలీ వేడుకలు జరుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు. మండలంలో ఈ హోలీ వేడుకలు కుల మతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకున్నారు.

గుడిహత్నూర్: హోలీ వేడుకలను శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే యువకులు, పిల్లలు వివిధ రంగులతో వీధుల్లో తిరుగుతూ ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ రంగునీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఆనందంగా గంతులు వేశారు.

మావల: మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మావలలోని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాసం వద్ద పార్టీ నాయకులతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు రంగులు పూసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

తాంసి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భాజా భజంత్రీలతో ఈలలు వేస్తూ గ్రామాల్లోని పలు విధుల గుండా తిరుగుతూ రంగులు చల్లారు. యువకులు, యువతులతో పాటు, చిన్నారులు సైతం రంగులు చల్లతో హోలీ పండుగను ఘనంగా జరిపారు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పొన్నారి, హసనాపూర్ గ్రామాలలో హోలీ సంబరాల్లో పాలుపంచుకున్నారు.

తలమడుగు: హోలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే, మండలంలోని ఆయా గ్రామాల్లో పండుగను జరుపుకున్నారు.

ఇచ్చోడ: ఉల్లాసం, ఉత్సాహాల మధ్య చిన్నాపెద్ద తేడా లేకుండా శుక్రవారం హోలీ వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. పల్లె పట్టణం అంతటా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రంగులు ఆడుతూ.. సంతోషంగా గడిపారు.

బోథ్: బోథ్, సోనాల మండలాలలో శుక్రవారం హోలీ పండుగ వేడుకలు యువకులు చిన్నారులు అనే తేడా లేకుండా రంగులు జల్లుకుంటూ పండుగ వేడుకలు జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు జల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే, బోథ్, సోనాల మండలాలకు చెందిన నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు రంగులు చల్లి పండుగ వేడుకలను జరుపుకున్నారు. అలాగే, హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హోలీ ఘనంగా జరుపుకున్నారు.

నార్నూర్: హోలీ వేడుకలు ఉమ్మడి మండలంలో ఘనంగా జరిగాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ చిన్నారులతో కలిసి హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఆదివాసీ గూడెలో తుడుం డోలు వాయిస్తూ నృత్యాలు చేశారు. మహిళలు పెద్దఎత్తున హోలీ వేడుకలు జరపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా!

(5వ పేజీ తరువాయి..)

సంబంధిత శాఖల అధికారులు కూడా చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది.

రైతులకు ఆశ చూపుతూ..

జిల్లాలో మైనింగ్ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అమాయక రైతులకు డబ్బును ఆశ చూపుతూ.. మైనింగ్ మాఫియా మొరం అక్రమ తవ్వకాలకు ఎగబడుతున్నారు. ప్రభుత్వం అందించిన అసైన్డ్ భూములను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అసైన్డ్ చట్టం ప్రకారం ఈ భూముల్లో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగకూడదు. ఈ విషయం సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు తెలిసినా.. మౌనంగానే ఉండిపోతున్నారు. రాళ్ల భూములను లెవలింగ్ చేస్తామని మాయమాటలు చెబుతూ.. అడ్డదారిలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు మొరం మట్టిని తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. అంతేకాకుండా అక్రమ తవ్వకాలతో పేద రైతుల భూములు ఎలాంటి పంటల సాగుకు యోగ్యంకాకుండా పోతున్నాయి. అమాయక రైతులకు డబ్బుతో ఎరవేస్తూ బంగారు భూములను రాళ్ల రప్పలుగా మార్చి వదిలేస్తున్నారు. పట్టపగలే ఇదంతా జరుగుతున్నా.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐటీడీఏ ఏపీవో జనరల్‌కు పితృవియోగం


ఏపీవోను పరామర్శిస్తున్న సుగుణ దంపతులు

ఉట్నూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ సహాయ ప్రాజెక్టు అధికారి(జనరల్) జాదవ్ వసంత్‌రావు తండ్రి జాదవ్‌నారాయణ హోలీ పండుగ రోజు మృతి చెందడంతో మండలంలోని శంకర్‌తండాలో విషాదం నెలకొంది. వసంతరావు తండ్రి నారాయణ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, భూజంగరావు దంపతులు శంకర్ తండాలోని వారి స్వగృహానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీవో వసంతరావు ఆయన సోదరుడు సంతోష్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

బోథ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బోథ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 3వ రోజుకు చేరాయి. కాగా, ప్రజలంతా హోలీ పండుగ వేడుకల్లో నిమగ్నమైతే ఎమ్మార్పీఎస్ నాయకులు మాత్రం పండుగను పక్కనపెట్టి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బస్టాండ్ దీక్ష శిబిరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడా స్వామితో పాటు జిల్లా నాయకులు కారం రవీందర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షలకు మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు సంఘీభావం ప్రకటించారు.


బోథ్‌లో మూడవ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

స్వతంత్ర్య ఉద్యమంలో అనబేరి ప్రభాకర్ రావు సేవలు మరువలేనివి


అనభేరి ప్రభాకర్‌రావుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అనభేరి ప్రభాకర్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఎల్లాపీ సంఘం జిల్లా అధ్యక్షులు కుప్పల మురళీ అధ్యక్షతన మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో అనభేరి ప్రభాకర్ 77వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో ఎల్లాపి సంఘం అధ్యక్షులు మురళీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దొనికెని దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ కదార్ల గంగ నర్సయ్య, సీపీఐయంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్యలతో పాటు తదితరులు వేదికపై మాట్లాడారు. ఈ సందర్భంగా అనభేరి ప్రభాకర్ చేసిన సేవలను గుర్తించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రభాకర్‌రావు సేవలను గుర్తించేలా పాఠ్య పుస్తకాల్లో ఆయన చరిత్రను ముద్రించాలని కోరారు. అనంతరం అనభేరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎల్లాపి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సైని గణపతి రావు, మాజీ జిల్లా కార్యదర్శి పడాల మోహన్ రావు, జిల్లా నాయకులు భోనగిరి కాంతారావు, పెర్క గంగాధర్, చింతపండు సత్తయ్య, శెట్టి ప్రభాకర్‌రావు,నర్సింగ్‌రావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

● పోలీసుల కళ్లు గప్పి.. దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులు ● అదే సమయంలో హోలీ సంబురాల్లో రోడ్లపైకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ● పోలీసులతో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం.. ఖానాపూర్‌లో ఉద్రిక్తత


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పోలీసులతో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

ఖానాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అసెంబ్లీలో స్పీకర్ పట్ల అనుచితంగా వ్యవహరించారని మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఆందోళన నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసేందుకు గుమిగూడిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తమ పార్టీ పిలుపు మేరకు తాము శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమైతే తమను ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులతో బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు అనుమతించేది లేదని సీఐ సైదారావు తేల్చిచెప్పారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో హోలీ సంబురాల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులు రోడ్డు పైకి వచ్చారు. ఇటు బీఆర్ఎస్ నాయకులు.. అటు కాంగ్రెస్ నాయకులు ఒకే చోటకు చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఓ వైపు పోలీసులు వీరిని నిశితంగా గమనిస్తుండగానే.. బీఆర్ఎస్ నాయకులు పోలీసుల కళ్లు గప్పి మెల్లగా తమ నిరసన అడ్డాను ఖానాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు మార్చారు. బీఆర్ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని.. అక్కడ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కొంతమంది తెలంగాణ చౌక్‌లోనే ఉండగానే.. మరికొంతమంది వెళ్లి అంబేద్కర్ చౌక్ వద్దకు వెళ్లి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడంతో పరిస్థితి ఒక్కసారి ఉద్రిక్తంగా మారింది. దీంతో తెలంగాణ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు పోలీసులు వేగంగా పరిగెత్తుకుంటూ వెళ్లి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను అడ్డుకున్నారు. దగ్ధమవుతున్న దిష్టిబొమ్మలపై నీళ్ల పోసి మంటలను ఆర్పి.. బీఆర్ఎస్ నేతలను అక్కడి నుంచి పంపించి వేయడంతో వివాదం సద్దుమణిగింది.

బాసరలో వెయ్యేళ్ల నాటి శిల్పాలు


బాసరలో నాటి శిల్పాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు

బాసర, మార్చి, 14 : (ఆంధ్రజ్యోతి) : చదువుల తల్లి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో వెయ్యేళ్ల నాటి పురాతన శిల్పాలను పురావస్తు పరిశోధకులు గుర్తించారు. శుక్రవారం బాసర పుణ్యక్షేత్రంలో పర్యటించి పురాతన ఆలయాలను సందర్శించారు. ఆలయాల వద్ద ఉన్న శిల్పాలను పరిశీలించగా ప్రాచీన కాలం నాటి శిల్పాలను గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బాసర నివాసి బలగం రామ్‌మోహన్ ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు పరి శోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి బాసరలో పర్యటించారు. చారిత్రక ఆనవాళ్లు, శిథిల ఆలయాలు, శాసనాలను పరిశీలించారు. ఆంజనేయ స్వామి ఆలయం ముందు క్రీస్తు శకం 11వ శతాబ్దం జైన శాసనాన్ని, గణేశాలయంలో క్రీస్తు శకం 8వ శతాబ్దం నాటి 5 అడుగుల ఎత్తు గల చాళుక్య గణేశ శిల్పం చారిత్రక ప్రాధాన్యత గలవని పురావస్తు పరిశోధకులు తెలిపారు. పాపహరేశ్వర ఆలయం ముందున్న క్రీస్తు శకం 9, 12 శతాబ్దిలకు చెందిన జైన యక్షిణి, భైరవ, శివలింగం, నంది, గణేశ, సతిశిలలు, దాన శాసనాలు విరిగిన శిలా తోరణాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో బలగం రామ్ మోహన్‌తో పాటు శిల్పులు బి. సుధాకర్ సింగ్, ధర్మేంద్ర కిరణ్, మోతిలాల్ ఉన్నారు.

నిర్మల్ జిల్లాలో హోలీ సంబురాలు


భైంసాలో డాక్టర్ అసోసియేషన్ సభ్యులతో హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ తదితరులు


భైంసాలో హోలీ ఆడుతున్న మహిళలు

భైంసా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : డివిజన్‌వాసులు హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం వేళ నుంచి సాయంత్రం సమయం వరకు చిన్న,పెద్ద అనే వయస్సుతో బేధం లేకుండా అందరు రంగులు చల్లుకుంటూ,పూసుకుంటూ వేడుకలను ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో యువజన,వ్యాపార, కుల సంఘాల సభ్యులు పండుగను సాముహికంగా వైభవోపేతంగా జరుపుకున్నారు. యువకులు డీజే సౌండ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసుకొని కాలనీల్లో శోభయాత్ర నిర్వహిస్తూ, నృత్యాలు చేస్తూ రంగులు పూసుకుంటూ పండుగను జరుపుకున్నారు. మహిళలు సైతం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా కాలనీల మహిళలు కాలనీ పరిధిలో గుంపుగుంపులుగా పర్యటనలు చేస్తూ రంగులు పూసుకుంటూ పర్వదినాన్ని భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు.

● హోలి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ హోలీ సంబరాల్లో మునిగి తేలారు. భైంసాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆయా ప్రాంతాలవాసులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులతో కలిసి నృత్యాలు చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ నివాస గృహానికి తరలివెళ్లి రంగులు పూసి హోలీ వేడుకలను సంబరంగా జరుపుకున్నారు.

శ్రీనగర్ కాలనీలో ..

నిర్మల్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ డీజే పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ ఆనందంగా గడిపారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముథోల్‌లో..

ముథోల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో పాటు మండలంలోని చించాల, వెంకటాపూర్, తరోడా, అష్టా, కారేగాం, సరస్వతీనగర్, ముద్గల్‌తో పాటు తదితర గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబురాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పల్లె పట్టణంలోని ఏ వీధుల్లో చూసిన హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు పెద్దలు రంగుల్లో మునిగితేలారు. చిన్నా పెద్ద కలిసి ఆడుతూ పాడుతూ రంగులు పూసుకుంటూ సందడీ చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సంవత్సరం ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలకు రసాయన రంగుల కన్నా పొడి రంగులతో పాటు సహజ సిద్ధమైన రంగులకే ప్రజలు ప్రాధాన్యతనిచ్చారు.

తానూర్‌లో..

తానూర్ , మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా శుక్రవారం హోళి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లోని విధులు రంగులమయం అయ్యాయి. హోళి పండుగను పుపురష్కరించుకొని మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు సంబరాలు చేసుకున్నారు. ఆత్మీయంగా ఒకరికొకరు రంగులు పూసుకొని హోళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నపిల్లల సందడి, యువకుల నృత్యాల మధ్య హోళి సంబరాలు అంబరాన్నంటాయి.



శ్రీనగర్ కాలనీలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం


బావ్ని గ్రామంలో రంగులు పూసుకుంటున్న గ్రామస్థులు

కుభీర్‌లో..

కుభీర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని పార్డి(బి), పల్సి, మాలేగాం, నిగ్వా, సౌనారి, తదితర గ్రామాల్లో శుక్రవారం హోళి పండగ వేడుకలు ఉల్లాసంగా ఉత్సహంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా రంగులను చల్లుకొని హోళి పండగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. పార్డి(బి) గ్రామంలో ఎస్సై రవీందర్, యువకులు నాయకులతో కలిసి హోళి వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

కుంటాల, మార్చి, 14 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పోసుకుంటూ హోలీ పండుగ జరుపుకున్నారు. యువకులు ఆనందోత్సహాల మధ్య హోలీ పండుగ జరుపుకున్నారు.


కుభీర్ మండల కేంద్రంలో చిన్నారులు





ఆదిలాబాద్ ఎమ్మెల్యేకు రంగు పూస్తున్న కలెక్టర్



ఆదిలాబాద్‌లో డాన్సులు చేస్తున్న ఉద్యోగులు



హోలీ సంబురం

హోలీ.. రంగోలి

- జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు
- వేడుకల్లో పాల్గొని స్టెప్పులేసిన కలెక్టర్, ఎస్పీ
- చిన్నారుల కోలాహలం, యువతీ యువకుల కేరింతలు
- ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ క్యాంపు ఆఫీసుల్లో రంగోలి సందడి
- ఊరు వాడలా డీజే, డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు
- హోలీ వేడుకల్లో విషాదం.. బైకు పైనుంచి పడి విద్యార్థి మృతి



రంగులు పూసుకుంటున్న చిన్నారులు



రంగులు పూసుకుంటున్న బాలికలు

ఆదిలాబాద్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రంగుల హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. శుక్రవారం జిల్లాకేంద్రంతో పాటు ఆయా మండలాల్లో ప్రజలు హోలీ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఊరువాడలా చిన్నాపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ఎటుచూసినా రంగోళీతో సందడి సందడిగా కనిపించింది. జిల్లాకేంద్రంలో పలువురు యువకులు ర్యాలీగా తిరుగుతూ రంగులతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. కలెక్టర్, ఎస్పీ క్యాంపు కార్యాలయాల్లోనూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రంగోళీ కార్యక్రమంలో పాల్గొని కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లకు పార్టీ నాయకులు, నేతలు పలువురు కార్యకర్తలు, అభిమానులు క్యాంపు కార్యాలయం, నివాసంలో రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జోగురామన్న నివాసంలో కూడా హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున హోలీ సంబరాలను జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటుచేశారు. పట్టణంలోని కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, గాంధీచౌక్, శివాజిచౌక్, వినాయక్‌చౌక్, తాంసిబస్టాండ్ ప్రధాన కూడళ్లలో పరిస్థితిని ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

● డ్యాన్స్‌లతో అదరగొట్టిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

హోలీ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ క్యాంపు కార్యాలయాలు సందడిగా మారాయి. పలువురు ఉద్యోగులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకొని ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటు ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. కొద్దిసేపు సిబ్బందితో కలిసి డీజే పాటలకు డ్యాన్సులతో అదరగొట్టారు. అలాగే ఎమ్మెల్యే పాయలశంకర్, తలమడుగు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోకగణేష్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రంగులు చల్లి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు.



హోలీ సంబరాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న దృశ్యం

హోలీ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపాలి

● ఎమ్మెల్యే పాయలశంకర్

హోలీ పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆదిలాబా ద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. హోలీ పండుగ సందర్భంగా శుక్రవా రం ఆయన నివాసం, క్యాంపు కార్యాలయాల్లో హోలీ వేడుకలు జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి కష్టాలు లేకుండా భగవంతుడు ప్రతి ఒక్కరిని సంతోషంగా ఉంచాలని కోరారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హోలీ పండుగను పెద్దఎత్తున జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సంస్కృతి, సంప్రదాయబద్ధంగా ప్రజలందరూ కలిసి హోలీ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సంప్రదాయంగా వస్తున్న పండుగలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. పండుగలను జరుపుకుంటూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నపెద్ద అనే తేడా లేకుండా ప్రతీఒక్కరు రంగులు పూసుకుంటు ఆనందంగా పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఊరువాడలా డీజే డాన్సులు

హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు పలువురు యువకులు ఉదయం నుంచే ఏర్పాట్లను చేసుకున్నారు. ఊరువాడలతోపాటు ఫాంహౌజుల్లో ప్రత్యేకంగా డీజేలను ఏర్పాటుచేసుకుని ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. స్నేహితులతో కలిసి ఉదయం నుంచి రాత్రివరకు ఆనందంగా గడిపారు. గ్రామాల్లో డప్పువాయిద్యాలతో ఊరేగింపులు నిర్వహించి రంగులు చల్లుకున్నారు. ఎటుచూసినా హోలీ రంగులమయమే కనిపించింది. యువకుల కేరింతలతో జోష్ కనిపించింది. ముఖానికి మాస్కులు ధరించి విచిత్రమైన వేషధారణతో రంగులు చల్లుత ఊరేగింపులు నిర్వహించారు.

● బైకుపై నుంచి పడి విద్యార్థి మృతి

ఆదిలాబాద్ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్న కుమ్మరివాడకు చెందిన జిల్లెడివార్ రిషి కుమార్ (16) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. స్నేహితునితో కలిసి బైకు పై వెళ్తుంగా అదుపుతప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో పదో తరగతి చదువుతున్న రిషికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా ప్రేమ్‌కుమార్ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ సునిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మార్చిలోనే భానుడి భగభగలు

● ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో గరిష్టంగా 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు మార్చి మాసంలోనే భానుడి భగభగలతో ఎండలు మండిపోతున్నాయి. గత వారం రోజులుగా ఎండలతీవ్రత మరింత ఎక్కువగా కన్పిస్తోంది. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 22.2 డిగ్రీలుగా నమోదైంది. అలాగే బోథ్ మండలం పొచ్చెరలో అత్యధికంగా 40.6 డిగ్రీలు, బేలలో 40.4, తలమడుగులో 40.3, ఆదిలాబాద్‌అర్బన్‌లో 40.2, తాంసిలో 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9గంటలకే భానుడి భగభగలకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రతకు భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. అలాగే చెరువులు, కుంటలు వాగులు అడుగంటుకుపోతున్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న వరి, జొన్న, మొక్కజొన్న, గోధుమ పంటలు ఎండుముఖం పడుతున్నాయి. తాగునీటితో పాటు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేసవి పరిస్థితులదృష్ట్యా జిల్లా అధికారులు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



నిర్మానుష్యంగా జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్‌చౌ

నిర్మల్‌లోనూ ఉష్ణోగ్రతలు పైపైకి..

నిర్మల్: నిర్మల్ జిల్లాలో క్రమేపి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వారం రోజుల క్రితం వరకు చల్లగా ఉన్న వాతావరణంలో మార్పు చోటుచేసుకొని క్రమేపి ఉక్కపోత పెరుగుతోంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల సమయం దాటిందంటే చాలు ఎండ తీవ్రత కూడా పెరిగిపోతోంది. వేసవి అరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే మాసాలలో ఇంకా ఎండల తీవ్రత ఎంత ఉంటుందని జనం ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లాలో శుక్రవారం 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చెబుతున్నారు. ఓవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జనం వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శీతల పానీయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.





ఎండల నుంచి రక్షణ పొందేందుకు గొడుగులను వినియోగిస్తున్న వీధివ్యాపారులు



భక్తి

ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



సుదర్శన పెరుమాళ్ల మూర్తికి బ్రహ్మాకలశంతో నిర్వహిస్తున్న శోభాయాత్ర

భైంసా,మార్చి14: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రారంభమై 19వ వార్షిక శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. గురువారం రాత్రి సుదర్శన పెరుమాళ్ల మూర్తికి బ్రహ్మకలశంతో ఆలయ ప్రాంగణంలో భాజభజంత్రీలతో మధ్య ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి వరకు పుష్ప యాగం, ప్రణయకలహోత్సవం, ఏకాంతసేవ, రుత్విక్ సన్మానం మహాకుంభప్రోక్షణ, మహాదాశీర్వచన కార్యక్రమాను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం వేళలో ఆలయ పండితులు ముగింపు పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని భక్తులతోపాటు సమీప ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సోనాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిధుల దుర్వినియోగంపై

విచారణకు రంగం సిద్ధం!

బోథ్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రభుత్వపరంగా మంజూరైన నిధులకు సంబంధించిన అక్రమాలపై జిల్లా యంత్రాంగం విచారణకు ఆదేశించినట్లు సమాచారం అందులో భాగంగానే శనివారం పాఠశాలను సందర్శించి పూర్తిస్థాయి నివేదిక అందించాలని జిల్లా అధికారుల నుండి స్థానిక మండల విద్యాధికారికి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అయితే శనివారం తగు విచారణ చేపట్టనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

● విద్యా కమిటీ చైర్మన్‌కు తెలియకుండానే..

పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌కు తెలియకుండానే పాఠశాలలో ఉపాధ్యాయులు కొందరు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని బిల్లులకు సంబంధించి తెల్ల కాగితాల పైన చైర్మన్ సంతకాలు తీసుకున్నట్లు ఉపాధ్యాయులపై ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు పాఠశాలలో ముగ్గురు మంది స్కావెంజర్లు పని చేయగా వారికి సంబంధించిన నెలసరి బిల్లుల చెల్లింపులు సైతం అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఏడాదికి 12 వేలపై చిలుకు నిధులు వార్తాపత్రికలు మ్యాగజైన్ల కోసం ప్రభుత్వపరంగా మంజూరి అవుతున్న వాటిని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి.

● చైర్మన్‌కు తెలియకుండానే విజ్ఞాన యాత్రలు

పాఠశాల నుండి ఇటీవల విద్యార్థులను ఉపాధ్యాయులు విజ్ఞాన విహారయాత్రకు తీసుకువెళ్లడం జరిగింది. అయితే ఈ విషయాన్ని పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షునికి తెలియకుండానే నిర్వహించినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఏదైనా అడిగితే ఉపాధ్యాయులు కొంతమంది చైర్మన్ తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలున్నాయి. పూర్తి విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే ఆస్కారం ఉంది.



స్వర్ణ వాగు నుంచి ఇసుకను వాహనంలో నింపుతున్న దృశ్యం

స్వర్ణవాగులో ఇసుక తవ్వకాలు!

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణవాగు ఎండిపోవడంతో ఇసుకాసురులకు వరంగా మారింది. స్వర్ణ ప్రాజెక్ట్ ఎస్కేప్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేయకపోవడంతో గత 15 రోజులుగా స్వర్ణ వాగు పొడవునా నీరు పూర్తిగా ఇంకిపోయింది. ఇదే అదునుగా చేసుకున్న ఇసుక అక్రమ వ్యాపారులు ఎక్కడికక్కడ యథేచ్ఛగా ఇసుక తవ్వకాలను జరుపుతున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోనే మంజులాపూర్, చిట్యాల్, వెంగ్వాపేట్ తదితర గ్రామాల నుంచి కూడా ఈ వాగు నుంచే వెళ్తుంది. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని వాగుల నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్లు, టిప్పర్‌ల ద్వారా జిల్లా కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు.



ఇసుకను తరలిస్తున్న దృశ్యం



జర దేఖో!!

నీటి కోసం క్యూ కట్టిన దృశ్యం

పార్డి(బి)లో..

తాగునీటికి తిప్పలు

● భగీరథ నీరు అందడం లేదని మహిళల ఆగ్రహం

కుబీర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల్లోనూ ఇంటింటికి నీరందించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చుచేసి మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించినా ఫలితం లేకుండా పోతోంది. కాగా ప్రారంభం నుంచే ఇంట్ర పైప్‌లైన్ పనులు నాసిరకంగా చేపట్టడంతో గ్రామంలో మిషన్‌భగీరథ నీరు సరిగా అందడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎండలతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో లక్షల రూపాయలతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మించినా ఇప్పటికీ చుక్క నీరందించడం లేదని ఉన్న మిని ట్యాంకులకు నీరు సరఫరా కావడం లేదని, నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, నాయకులకు తమ తాగునీటి తిప్పలు తీర్చాలని చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నీటికోసం రాత్రి 11 గంటల వరకు వరుసలో బిందెలు, బక్కెట్ వరసలో ఉంచి వేచి చూస్తున్నామని, అధికారులు స్పందించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.9 , కనిష్ఠం 23.7
నిర్మల్
జిల్లా వార్తలు
8
శనివారం 15 మార్చి 2025




'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముథోల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముథోల్ మండల విద్యాధికారి రమణారెడ్డి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే ఏప్రిల్ 4వ తేదీ వరకు మండలంలోని 4 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు నిర్వహణ జరుగుతుందన్నారు. పదవతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహణకు గాను ప్రతి పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్ రోస్టర్ దాచి

రూ.కోటి దోచే ప్లాన్



- డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వసూళ్ల పర్వం
- ఇప్పటికే పలువురు అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు
- అభ్యర్థుల అమాయకత్వం ఆసరాగా.. చేతివాటం
- కార్యాలయ ఉద్యోగి, అధికారి మిలాఖతై వసూళ్ల దందా
- కలెక్టర్‌తో సంతకాలకు ఫైలు సిద్ధం ?
- ఎమ్మెల్యే ఏలేటీ ఆదేశించినా ఆర్‌ఓఆర్ విడుదల చేయని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం

నిర్మల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వశాఖల్లో రెగ్యులర్ ఉద్యోగాలతో పాటు ఎలాంటి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఏదైనా సరే..! ఖచ్చితంగా నోటిఫికేషన్ సమయంలోనే రోల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ జాబితాను ప్రకటించాలి. ఇదీ ఖచ్చితమైన నిబంధన. మొత్తం ఖాళీలను ప్రకటిస్తూ ఆ ఖాళీల్లో జనరల్ ఖాళీలు ఎన్ని... మిగతా రిజర్వేషన్‌ల పోస్టులు ఎన్ని అనే జాబితాను ముందుగానే డిస్‌ప్లే చేయాలి. ఓ.సీ, ఈడబ్ల్యూఎస్, బీ.సీ(ఏ), బీ.సీ(బి), బీ.సీ(సీ), బీ.సీ(డి), బీ.సీ(ఈ), ఎస్సీ, ఎస్టీ, స్పోర్ట్స్, వికలాంగుల కోటా, ఎక్స్ సర్వీస్‌మెన్ ఇలా మొత్తం ఎవరికి ఎన్ని పోస్టులు రిజర్వ్ చేయబడ్డాయో ఆ జాబితాను ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌తోనే డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. కానీ గత ఐదేళ్లుగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాత్రం ఈ రిజర్వేషన్‌ల రోస్టర్/రోల్ ఆఫ్ రిజర్వేషన్ జాబితాను ప్రకటించడం లేదు. ఎందుకంటే అసలు తిరకాసు ఇక్కడే దాగి ఉంది. ఈ వ్యవహారం వెనక జిల్లా కార్యాలయ అధికారులతో పాటు ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పుతున్నాడన్న ఆరోపణలున్నాయి. గతంలో ఉన్న డీఎంఅండ్‌హెచ్‌వోను ఇలాగే తప్పుదోవ పట్టించి భారీగా దండుకున్న కార్యాలయ సిబ్బంది మరోసారి ఇదే తరహాలో నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బుల వసూళ్లకు దిగారు. ఇటీవలనే విడుదల చేసిన నోటిఫికేషన్‌లో సైతం ఇలాగే ఆర్‌ఓఆర్ డిస్‌ప్లే చేయకుండా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు సేకరించారు.

వసూళ్ల దందాకు తెరలేపిన కార్యాలయం

రిజర్వేషన్ రోస్టర్ దాచి పెట్టి పక్కాగా కోటి రూపాయలు దోచేసే స్కెచ్ వేశారు నిర్మల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ యంత్రాంగం. దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కార్యాలయం రిజర్వేషన్ రోస్టర్‌ను డిస్‌ప్లే చేయలేదు. అయితే దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికి ఖచ్చితంగా ఉద్యోగం వస్తుందోనన్న విషయం కార్యాలయ సిబ్బందికి ముందుగానే తెలిసిందిపోతుంది. ఎందుకంటే రోల్ ఆఫ్ రిజర్వేషన్ జాబితా వారి వద్ద మాత్రమే ఉంటుంది. మొత్తం దరఖాస్తులు స్వీకరించిన తరువాత మార్కుల జాబితాను మాత్రమే ప్రకటించారు. అయితే ఎక్కువ మార్కులు ఉన్న వారికి జనరల్ ఖాళీల్లో ఉద్యోగాలు దక్కుతాయి. మిగతా రిజర్వేషన్‌ల కేటగిరిలో వచ్చే వారి సమాచారం కార్యాలయ అధికారులు, సిబ్బంది వద్ద మాత్రమే ఉండడంతో ఇక్కడే వారి ప్లాన్ మొదలుపెట్టారు. ఖచ్చితంగా రిజర్వేషన్‌ల ప్రకారం ఉద్యోగాలు వచ్చే వారి సమాచారం ముందే వీరికి తెలుస్తుండడంతో అభ్యర్థులకు తమ సన్నిహితుల ద్వారా సమాచారం అందిస్తున్నారు. వారి నుంచి రూ. 3 నుంచి రూ. 5 లక్షల వరకు డబ్బుల వసూళ్లకు దిగుతున్నారని తెలిసింది. జిల్లాలో గత ఏడాది ఆగస్టు నెలలో 15 మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే గత ఏడాది ఫిబ్రవరిలో తొమ్మిది స్టాఫ్ నర్సు, ఒక రిఫ్రిజిరేటర్ మెకానిక్, ఒక డిస్ట్రిక్ ప్రోగ్రాం అధికారి, ఒక సైకాలజిస్ట్, 6 ఏఎన్‌యం, రెండు డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే రెండేళ్ల క్రితం ఆర్‌బీఎస్‌కె విభాగంలో నాలుగు ఆయూష్ మెడికల్ ఆఫీసర్ ఒక ఫార్మాసిస్టు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వీటికి సంబంధించి మెరిట్ జాబితాలు కార్యాలయ యంత్రాంగం సిద్ధం చేసి పెట్టింది.

ఇదీ వసూళ్లపర్వం.. ఇప్పటికే అడ్వాన్స్‌లు ?

జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులతో పాటు మిగతా స్టాఫ్ నర్సు, ఏఎన్ఎం, ఆర్‌బీఎస్‌కె ఇలా అన్ని పోస్టులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల సమాచారం డీయంఅండ్‌హెచ్‌వో కార్యాలయ సిబ్బంది వద్ద ఉంది. ఎవరైతే ఈ నోటిఫికేషన్‌లలో ఎంపికయ్యారో వారికి కార్యాలయంలో పని చేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పి కార్యాలయ అధికారిని తప్పుదోవ పట్టించి సమాచారం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం వస్తుందన్న ఆశతో రోల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం న్యాయబద్ధంగానే ఉద్యోగాలు దక్కుతున్నప్పటికీ తమ ఉద్యోగం ఎక్కడ మిస్ అవుతుందోనన్న భయంతో లక్షల రూపాయలు సమర్పించుకుంటున్నట్లు తెలిసింది. అదే రోల్ ఆఫ్ రిజర్వేషన్ లిస్టు ముందుగానే డిస్‌ప్లే చేసి ఉంటే రిజర్వేషన్‌ల ప్రకారం తమకు ఉద్యోగం దక్కుతుందా లేదా అన్న స్పష్టత అభ్యర్థులకు వచ్చేది. ఆర్‌ఓఆర్ డిస్‌ప్లే చేయని కారణంగా ఉద్యోగాలను ఎలాగైనా సాధించుకోవాలన్న ఆశతో అమాయక అభ్యర్థులు తమకు న్యాయంగా వస్తున్న ఉద్యోగాలను లక్షల రూపాయలు ఇచ్చి కొనుక్కునే పరిస్థితి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఏర్పడింది. దీనిపై పలువురు అభ్యర్థులు రోల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకటించాలని జిల్లా అధికారులను కోరినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో వచ్చే ఉద్యోగం ఎక్కడ పోతుందోనన్న భయంతో అర్హులైన అభ్యర్థులు సైతం పెద్దమొత్తంలో డబ్బులు సమర్పించుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే కొందరు అడ్వాన్స్‌ల రూపంలో ఇచ్చి మిగతా మొత్తం ఉద్యోగ నియామక పత్రాల సమయంలో ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఇంతా నిర్భయంగా రోల్ ఆఫ్ రిజర్వేషన్ డిస్‌ప్లే చేయకుండా ఉద్యోగాల భర్తీ పేరిట భారీ దోపిడీ జరుగుతున్న తీరు ఆరోగ్యశాఖలో తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది.

రెండేళ్ల క్రితం నాటి నోటిఫికేషన్‌కు మళ్లీ జీవం

వాస్తవానికి ప్రభుత్వశాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నోటిఫికేషన్‌లకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఆ భర్తీ ప్రక్రియ ఏడాదిలోగా ముగియాలి. కానీ 2023 సంవత్సరంలో ఆర్‌బీఎస్‌కే విభాగంలో నాలుగు మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మాసిస్ట్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి కూడా భారీగానే వసూళ్లు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అనేక ఫిర్యాదులు రావడంతో అప్పటి కలెక్టర్ నోటిఫికేషన్‌ను పెండింగ్‌లో పెట్టారు. అయితే తాజాగా అదే నోటిఫికేషన్ ప్రకారం పోస్టులు భర్తీ చేసేందుకు తాజాగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఫైలు బూజు దులిపినట్లు తెలుస్తోంది. దీనిపై కూడా అనేక ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశించినా..

ఇదిలా ఉంటే రోల్ ఆఫ్ రిజర్వేషన్ డిస్‌ప్లే విషయంలో ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి గతంలో డీఎంఅండ్‌హెచ్‌వోను సీరియస్‌గా హెచ్చరించారు. కలెక్టర్‌కు కూడా ఈ విషయంపై సూచన చేశారు. కానీ ఇప్పటి దాక నిర్మల్ డీయంఅండ్‌హెచ్‌వో కార్యాలయం అధికారులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నోటిపికేషన్ భర్తీలకు సంబంధించిన రోల్ ఆఫ్ రిజర్వేషన్‌ను డిస్‌ప్లే చేయకుండా దాచి పెడుతుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్న కార్యాలయ ఉద్యోగితో పాటు అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరపాలని నిరుద్యోగ సంఘాలు కొందరు నష్టపోతున్న అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తాము కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

కలెక్టర్ నిర్ణయంపైనే ఉత్కంఠ

పెద్దమొత్తంలో అవినీతి అక్రమాలకు దారి తీసిన ఆరోగ్య శాఖ నోటిఫికేషన్‌ల వ్యవహారంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న ఉత్కంఠ ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అమాయక అభ్యర్థుల నుంచి, న్యాయబద్ధంగా అర్హత సాధించిన వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యవహారం ఇంకా కలెక్టర్ దృష్టికి వెళ్లిందా లేదా అన్నది తెలియడం లేదు. వ్యవహారం బయటకు పొక్కకముందే ఖాళీలను భర్తీ చేసి అడ్డదారిన కోటి రూపాయలను నొక్కేసే ప్లాన్ జరుగుతున్నదన్న చర్చ వినిపిస్తున్నది. ఇప్పటికైనా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి ఈ వ్యవహారంలో అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జోరుగా.. హుషారుగా.. హోలీ





దిలావర్‌పూర్ మండలం న్యాలోలంలో కామ దహనానికి ముందు పూజలు చేస్తున్న గ్రామస్థులు



ఎస్పీ జానకీషర్మిలకు రంగులు పూస్తున్న కలెక్టర్ అభిలాష



అదనపు కలెక్టర్‌ఫైజాన్‌అహ్మద్‌కు రంగులు పూస్తున్న కలెక్టర్



దివ్యనగర్ కాలనీలోని శ్రీ రెసిడెన్సీలో హోలీ సంబురాలు



ఎఎన్ రెడ్డి కాలనీలోని ఎఎంఆర్ టవర్స్‌లో హోలీ సంబురాలు చేసుకుంటున్న దృశ్యం



జిల్లా కేంద్రంలో హోలీ శోభాయాత్రలో ప్రముఖులు



ఖానాపూర్ తెలంగాణ చౌక్‌లో నృత్యాలు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేందర్, నాయకులు

నిర్మల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా జోరుగా.. హుషారుగా హోలీ పండుగను సంప్రదాయ బద్ధంగా శుక్రవారం జరుపుకున్నారు. గురువారం రాత్రి కామ మండపాలను పేర్చి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి దహనం చేశారు. నిర్మల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం నుంచే గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ప్రతి ఒక్కరిపై రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. అలాగే మలక్ చించోలి గ్రామంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహించే కుస్తీల పోటీలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కుస్తీల పోటీలకు ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హజరై కుస్తీల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం హోలీ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. సహజ రంగులతో నిర్వహించిన హోలీ సంబురాల్లో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, క్యాంపు కార్యాలయ సిబ్బంది, పాత్రికేయ బృందం పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయంగా సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు. అదే పట్టణంలోని ఎఎన్‌రెడ్డి కాలనీలో, దివ్యనగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

ఖానాపూర్‌లో..

నిర్మల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండల కేంద్రంతో మండలంలో హోలీ పర్వదిన వేడుకలను ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టీఆర్ చౌక్‌లో రంగుల బండికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్ర ప్రారంభించారు. ఈ శోభాయాత్రలో పార్టీలకు అతీతంగా పట్టణ, మండల ప్రముఖులు పాల్గొని హ ఓలీ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. హోలీ శోభయాత్రను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ మిఠాయిలు పంచుకుంటూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ రాహుల్ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు. జిల్లా ఎఎస్పీ రాజేశ్ మీనా ఖానాపూర్‌లో పరిస్థితిని సమీక్షించారు. ఈ శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది.

దిలావర్‌పూర్ మండలంలో..

దిలావర్‌పూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రంగులకేళి హోలీ సంబురాలు అంబరాన్ని అంటాయి. గుండంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి కాముడి దహనం కార్యక్రమం నిర్వహించగా మిగతా గ్రామాల్లో గురువారం రాత్రి కాముని దహనం నిర్వహించారు. శుక్రవారం చిన్నా పెద్ద తేడా లేకుండా అందరు రోడ్లపైకి వచ్చి పరస్పరం రంగులు చల్లుకున్నారు. చిన్న పిల్లలు బృందాలుగా ఏర్పడి బాటిల్‌లో రంగుల నింపుకొని హోలీ ఆడుతూ ప్రతి ఒక్కరిపై రంగులు చల్లుతూ ఏంజాయ్ చేశారు. చిన్న నాటి స్నేహితులతో కలిసి యువకులు రంగుల పండుగను రంజుగా జరుపుకున్నారు. స్థానిక కేజీబీవీలో టీచర్లు విద్యార్థులతో కలిసి హోలీ సంబురాలు చేసుకున్నారు.

మామడ మండలంలో..

మామడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రోజున రాత్రి కాముని దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున ఉదయం నుంచి చిన్న పెద్ద తేడా లేకుండా అందరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. పౌర్ణమి కావడంతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా పోలీసుశాఖకు విశేష సేవలందించిన

పోలీసు జాగిలం అనారోగ్యంతో మృతి

- హంటర్‌కు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు
- ఘన నివాళి అర్పించిన జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



హంటర్‌కు నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసుశాఖలో విశేష సేవలు అందించిన హంటర్ (పోలీసు జాగిలం) అనారోగ్యంతో మృతి చెందినట్లు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖకు హంటర్ చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హంటర్ పార్థిక దేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. జాగిలం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. హంటర్ శిక్షణ సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా పోలీసుశాఖలో ఫిబ్రవరి 1వ తేదీ 2022 సంవత్సరం నుంచి విధులు నిర్వహిస్తుందన్నారు. హత్యలు, దొంగతనాల కేసులను చేధించడంలో హంటర్ ప్రతిభ కనబర్చిందన్నారు. విధి నిర్వహణలోనే కాకుండా పలు జాతీయస్థాయిలో పోలీసుడ్యూటీ మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ రాజేశ్ మీనా, ఎస్ఐలు ప్రేమ్‌కుమార్, కృష్ణ, ఆర్ఐలు రాం నిరంజన్, శేఖర్, రమేష్, ఎస్ఐ లింబాద్రి, ఆర్ఎస్ఐలు, జాగిలం సంరక్షకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

భైంసా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ఒంటిపూట బడుల నిర్వాహణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ నెల 15 నుంచి ఒక్కపూట మాత్రమే బడులను నడిపించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత అధికంగా ఉండబోతోందని వాతావరణ శాఖ నిపుణులు సూచించారు. దీంతో ప్రభుత్వం ఒంటిపూట బడులను నడింపేందుకు గాను ఉపక్రమించింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూడ బడులు వచ్చే నెల 23 వరకు కొనసాగనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం యథావిధిగా కొనసాగనుంది. ఒంటిపూట బడులు సమయం ముగియగానే విద్యా ర్థులకు మధ్యాహ్న భోజనం అందించి తరువాతే ఇంటికి పంపించాల్సి ఉంటుంది.